తర్వాత వచ్చిన వార్తలనుబట్టి ఏప్రిల్ 6వ తేదీనాడు, మార్మగోవాలో సైన్యాన్ని ప్రయోగించి ప్రజను హింసించారు. సత్యాగ్రహులను అతి రాక్షసంగా హింసిస్తున్నారు. వీళ్ళపట్ల పోర్చుగీస్ వారిప్రవర్తన శుద్ధ అనాగరికంగా ఉన్నది. మార్మగోవా, మపూకా, కానకోనల్లో పరిస్థితులు అధికారుల చేతులుదాటి పోయాయి" "దీన్నిబట్టి గోవాలో పరిస్థితులు ఘోరంగా ఉన్నట్లు తేల్తోంది. అక్కడ ప్రజలకు ఏరకమైన స్వాతంత్ర్యంగాని లేదు. పోర్చుగీస్ అధికారులు సత్యాగ్రహుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించక పోతే, సత్యాగ్రహులను ప్రవాసాలకు పంపిస్తే ఇది మరీ ఘోరరూపం దాలుస్తుంది" అని భారత ప్రధాని విడుదలచేసిన సుదీర్ఘ ప్రకటనలో ఉన్నది.

పోర్చుగీస్ ప్రభుత్వం గోవాసత్యాగ్రహులను తూర్పు ఆఫ్రికాకు పంపిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఇంకా ధృవపడలేదు. ఈ విషయమై భారత ప్రభుత్వం పోర్చుగీస్ మంత్రికి వ్రాసినలేఖ తిరస్కరించబడ్డది. గోవాలోని పోర్చుగీస్ అధికారుల దమననీతిని ఖండిస్తూ భారత విదేశాంగ శాఖ వ్రాసిన మరొక ఉత్తరకూడా త్రిప్పివేయబడింది. ఈ విధంగా "బుడతకీచులు" సభ్యతా సంస్కృతులనూ మానమర్యాదలనూ వదిలేసి 'అనాగరికంగా' మృగాల్లా ప్రవర్తించటం సభ్యతా ప్రపంచానికి ఆశ్చర్యకరంగా ఉన్నమాట నిజం.

ఏది ఏమైనప్పటికీ ప్రజావెల్లువ ఒక వైపునుండి బుడతకీచుల్ని ముంచివేస్తున్నది. మే 18వ తేదీన ఈ వెల్లువ మహోన్నతమై తన ఉత్తుంగతరంగాలతో గోవాలోకి ప్రవేశించి తరతరాల దాస్యబంధానుంచి దాన్ని విముక్తి కలిగించటం తథ్యం. గోవాజాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పీటర్ఆల్వారెస్ వ్రాసిచ్చినట్లు గోవావిషయంలో భారత ప్రభుత్వం వెనుకటికంటె కొంత శ్రద్ధచూపి పోర్చుగల్ ప్రభుత్వాన్ని అధికారికంగా హెచ్చరించటం శుభసూచకం.

ఈ మహోద్యమానికి యావద్భారత ప్రజాసందోహము ఆర్థికంగా, నైతికంగా సహాయపడటం తమ కనీసకర్తవ్యంగా భావించాలి. ఈ ఉద్యమాన్ని గురించి ప్రజల్లో విరివిగా ప్రచారం చేయటానికి పార్లమెంటులోని వివిధపక్ష ప్రతినిధులతో కూడిన సంఘం నిశ్చయించింది. వీరికి సర్వవిధాలా సహాయపడటం మన విద్యుక్త ధర్మం.

---

గల్పిక

# అంటుని అదృష్టం

ఎస్. లక్ష్మనరసింహాచార్య

ఆ వీధిలో వరుసగా అంతస్తులతో కూడిన సిమ్మెంటు మేడలున్నాయి. దీనికి కారణం ఆ పట్నంలో ధనవంతుల్లో చాలభాగం ఆ వీధిలో నివసించడమే. ప్రతిమేడా అధునాతన ప్రణాలికతో—విద్యుత్ మొదలైన సౌకర్యాలతో నిర్మింపబడింది. ప్రతిమేడకూ ఒక కారు షెడ్డు కూడా వుంది. పురములోని ప్రఖ్యాత వణిక్ప్రముఖులు పెద్దపెద్ద ఉద్యోగులకు నివాసమైన తావు ఆవీధి—నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుంటుంది. ఆ వీధిలో పురపాలక సంఘసభ్యులూ కొందరూ, అధ్యక్షుడూ వున్నందువలన, ఆ వీధి ఆరోగ్య విషయంలో, తక్కిన వీధులకంటె అందెవేసింది—వీధి పరిశుభ్రమై, క్రింద కూర్చున్నా మకిలి కానట్టుగా వుంటుంది.

దీనికి వెనుకనేవుంది మరొకవీధి—అది అనారోగ్యానికి ఆలవాలమై—ఈగలూ దోమలూ ఝుమ్మంటయ్ పట్టపగలే! ఇళ్ళు ఇటుకగా కట్టబడినవి. పడిపోతున్న పెంకుటిళ్ళు తక్కువైనా-పూరికొంపలు-గుడిశెలు మాత్రం లెక్కలేనన్ని—దీనినిట్టిబట్టి ఆ వీధిప్రజలు ఏ తరగతికి చెందుతారో మనం సులభంగా ఊహించగలం—వాళ్ళు బీదలు కష్టజీవులు, కాలాడితేగాని కుండాడని ప్రజ!

అంతస్థుల మీదవులికే, ధనవంతుల విలాసాలు వారిపాటలు, వారి ఆటలు వీరి కన్నులకు స్పష్టం-

"వాళ్ళు ధనవంతులు వాళ్ళు అదృష్టవంతులు కాబట్టి, గొప్పోళ్ళలో పుట్టి కులుకుతున్నారు. మనం పేదవాళ్ళం మనం చేసుకున్న కర్మగాబట్టి దరిద్రాన్ననుభవిస్తున్నాం" ఈ విధమైన సంఘర్షణ ఏనాడో వాళ్ళ నిత్యజీవితంలో మొద్దుబారినవి.

ఆవేళసంక్రాంతి.చెప్పనలనికాని వైభవోపేతంగా వుంది ధనవంతులవీధి...చెప్పనలవిగాని దుర్భర హీనస్థితిలోవుంది బీదలవీధి...పండుగలు వస్తుంటాయి, పోతాయి. వాటిఫలితాలూ వాటి ఆనందాలూ ధనవంతులకే! బీదలకు ఆ పండుగ నిత్య జీవితంలో, నిరాడంబరమైన రోజు ధనవంతులకు ఆడంబరమైన రోజు.

రామిగాడి కుటుంబంలో ఆవేళ యే కొత్తదనమూ లేదు; గుడిసెలో కుక్కినులకమంచంమీద మేనువాల్చి ఎదురుగా ధనవంతుల మేడల అంతస్థుల్లో ఎలక్ట్రిక్ దీపాల కాంతిలో వెలిగిపోతున్న ధనవంతుల కులుకులు, విలాసాలు, చుట్టపొగనుంచి అరమోడ్పు కళ్ళతో చూస్తూ, తన జన్మ నిరర్థకమైందని నిందించుకున్నాడు. అంతస్తుల్లోంచి నేరుగావచ్చి, రామిగాడి చెవుల్లో ప్రవేశిస్తున్న రేడియోగానానికి రామిగాడు కళ్ళు మూసాడు.

తెలివి వచ్చింది. ఠాణాలో గంటలు రెండు కొట్టారు-వాడు అలాగే పడివున్నాడు. వాడి గుడిసెకు ద్వారంలేదు. తలపైకెత్తిచూచాడు.విద్యుద్దీపాలకాంతి తగ్గింది. ధనవంతుల యిళ్లు తలుపులు వేసివున్నాయి.

నిద్రమైకంలో రామిగాడికి మానవాతీతులైన కొందరు దేవతాస్త్రీలు ఒక భాగ్యవంతుని మేడ మెట్లు ఎక్కుతున్నట్లు కన్పించారు. వాళ్ళ ముఖాలు స్పష్టంగాలేగావుని, శరీరాలు కాంతివంతంగా వున్నాయి. దేవతలు లోపలకు వెళ్ళి తిరిగివస్తున్నారు. మూసిన తలుపులు వాళ్ళని అడ్డలేదు. వాళ్ళు మరొక భాగ్యవంతుని యింటికి మరలే స్థితిలో వున్నారు. రామిగాడు. తన శని విరగడౌతుందని వాళ్ళను ఎలుగెత్తి పిలిచాడు—"ఓ దేవతల్లారా! మా గుడిసెలు పావనంచెయ్యండి-మమ్మలను పావనం చెయ్యండి" అని అరచాడు.

"అసంభవం" అన్నారు దేవతలు.

రామిగాడు వళ్ళు చూచుకున్నాడు. చింకి చొక్కా- కుక్కిమంచం - కునికే దీపబుడ్డీ - వాయుదేవుడు తనశక్తిని చూపించాడు. కునికే నక్కమీద పడిన తాటిపండులా ఆరి, దీపం ఆరినవాసన వేసింది. ఇప్పుడు మరీ స్పష్టంగా కన్పిస్తున్నారు దేవతలు. ఎలుగెత్తి అరిచాడు రామిగాడు. దూరంనుంచే దండాలు పెట్టాడు. వాళ్ళను అక్కడకు రమ్మనికోరాడు. "మేము సంక్రాంతి దేవతలం—అదృష్టదేవతలం...మీకా అదృష్టంలేదు. మేము అక్కడ అడుగు పెట్టం" అన్నారు దేవతలు. రామిగాడు గోలవదల్లేదు.

దేవతలు యేమి ఆలోచించారో యేమో! చరచరా వచ్చారు. దేదీప్యమానమైన కాంతిలో గుడిసెముందు నిలబడ్డారు. వారి ఆభరణాలు వారి దుస్తులూ కళ్ళు మిరిమిట్లు గొలిపే కాంతిని ప్రసరింప జేస్తున్నాయి రామిగాడి కళ్ళకు. ఆప్యాయంగా సంబరపడుతూ ఆహ్వానించాడు రామిగాడు దేవతలను తన గుడిసెలోనికి. కాని కాని, ఆశ్చర్యం వాళ్ళ దేదీప్తమైన కాంతి పోయింది. వారి ఆభరణాలు కగ్గిపోయాయి. వాళ్ళబట్టలు చింకివిగా కన్పించసాగేయి. వాళ్ళ ముఖాలు వికృతంగా మారిపోతున్నాయి. రామిగాడు ఆశ్చర్యపోతున్నాడు. వారివల్ల తనకు అదృష్టం పడుతుందనుకున్నాడు కాని రామిగాడిదశ, గుడిసెలో అడుగుపెట్టిన దేవతలకు పట్టింది. క్షణక్షణానికి వికృతరూపంగా మారిపోతున్న దేవతల్ని చూచి, రామిగాడు కేకలేస్తూ మంచం మీదనుండి క్రింద పడ్డాడు. లేచి చుట్టూ చూచాడు. దేవతల్లేరు. ఎదురుగా చూచాడు. పూర్వపు కాంతులతో భాగ్యవంతుల యిళ్ళలోకి అప్పుడప్పుడే అదృశ్యమైనట్లు కన్పించసాగారు ఆ అమాయకునికి.

---

నగలదుకాణం చూస్తూ "ఆ చక్కని గాజుల జత నా చేతులకి బాగుంటాయి కదూ"అంది నూత్న వధువు. "అవును కాని అవి కొనే స్తోమతు నాకు లేదు"అన్నాడు భర్త. "పోనీ వుంటే కొనేవారేకదూ?" అంది అమ్మాయి. "అబ్బే! అప్పుడు యింత చవకవి మనకెందుకు!"అన్నాడు భర్త.